పోలింగ్‌కు సర్వం సిద్ధం

- దేశంలోనే శేరిలింగంపల్లి అతి పెద్ద నియోజకవర్గం
- మొత్తం పోలింగ్ బూత్‌లు 638
- వికలాంగులు, వృద్ధుల కోసం రవాణా సదుపాయం
- పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లను అనుమతించం
- శేరిలింగంపల్లి రిటర్నింగ్ ఆఫీసర్ బి.శ్రీనివాస్‌రెడ్డి


పోలింగ్ స్టేషన్లకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్న సిబ్బంది

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేసినట్లు రిటర్నింగ్ ఆఫీసర్ బి.శ్రీనివాస్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. దేశంలోనే శేరిలింగంపల్లి ఎక్కువ ఓటర్లు, పోలింగ్ స్టేషన్లు ఉన్న నియోజవర్గం అని తెలిపారు. పీఓలు, ఏపీఓలు ,ఓపీఓలు, వెబ్ కాస్టింగ్, వలంటీర్లు పని చేస్తున్నారని తెలిపారు. సిబ్బందికి పోలింగ్ కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు 197 లొకేషన్లలో 638 పోలింగ్‌స్టేషన్లలో ఇన్‌సైడ్ లైవ్ వెబ్ కాస్ట్, 328 పోలింగ్ కేంద్రాలలో ఇన్‌సైడ్ వెబ్‌కాస్ట్ వీడియో కెమెరాలను అమర్చామన్నారు. 24 సమస్యాత్మక ప్రాంతాలలో సాయుధ బలగాలతో పాటు స్థానిక పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. వికలాంగులు, 80 ఏళ్ల పైబడిన సీనియర్ సిటిజన్స్ కోసం నియోజకవర్గంలో ప్రత్యేక క్యూ కోసం వాలంటీర్లను నియమించామన్నారు. వారిని డోర్ టు డోర్ పికప్, డ్రాప్ చేసేందుకు 138 ఆటోలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, అదనపు పోలింగ్ ఆఫీసర్‌లు ముగ్గురు, ఒక వెబ్ కాస్టింగ్, బయట ఓ బీఎల్‌ఓ, ఒక వాలంటీర్ పని చేస్తారని చెప్పారు. ఓటరు ఐడీ లేని పక్షంలో ఓటింగ్ కేంద్రానికి వచ్చినప్పుడు ప్రభుత్వాలు జారీ చేసిన 12 గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి చూపించాలన్నారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లను అనుమతించమని స్పష్టం చేశారు. నవంబర్ 30 ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రంలో ఐదు గంటల లోపు క్యూలో ఉన్నవారికి ఓటర్ స్లిప్స్ ఇచ్చి ఓటింగ్‌కు అనుమతిస్తారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఐదేళ్లకు ఒకసారి ఓటు వేసే అవకాశం వస్తుందని, నిర్భయంగా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. కాగా గచ్చిబౌలి స్టేడియంకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సిబ్బందికి ఎన్నికల సామగ్రిని అందజేశారు. పోలింగ్ స్టేషన్ల వారీగా ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, బ్యాలెట్‌లతో పాటు ఇతర సామగ్రిని తీసుకొని సంబంధిత సిబ్బంది ఆయా రూట్‌లలో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. 638 పోలింగ్ స్టేషన్లకు ఆయా రూట్‌లలో కేటాయించిన బస్సులలో సిబ్బంది వెళ్లారు. ఎన్నికల విధుల్లో 4600 మంది సిబ్బంది పని చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ వెస్ట్ జోనల్ సిబ్బంది డిస్ట్రిబ్యూషన్‌లో పాల్గొన్నారు.


ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.శ్రీనివాస్‌రెడ్డి

పోలింగ్ బూత్‌లు	: 638
సిబ్బంది	: 4600
ప్రిసైడింగ్ అధికారులు	: 670
ఓపీఓలు	: 2900
ఈవీఎంలు	: 738
బ్యాలెట్ యూనిట్లు	: 1278

అతి పెద్ద నియోజకవర్గం

అతిపెద్ద నియోజకవర్గమైన శేరిలింగంపల్లిలో మొత్తం 7,32,506 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 3,88,482, మహిళలు 3,43,875, ఇతరులు 149 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 622 పోలింగ్ స్టేషన్లు ఉండగా అదనంగా మరో 16 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. వికలాంగులు 5,407, 80 ఏళ్లకు పైబడిన వారు 8,102, ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు 27, సర్వీస్ ఓటర్లు 54 మంది ఉన్నారు.

పోలింగ్ స్టేషన్లకు చేరిన ఈవీఎంలు

హఫీజ్‌పేట్ : చందానగర్, హఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలోని పోలింగ్ స్టేషన్లకు ఈవీఎంలు చేరుకున్నాయి.


ఎన్నికల విధుల కోసం చంటి పాపతో షాద్‌నగర్ నుంచి వచ్చిన ఓ ఉద్యోగి

చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 150 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. బుధవారం సాయంత్రం పోలీసు భద్రత నడుమ సమస్యాత్మక ప్రాంతాలలోని పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు.


ఈ వీఎంలు, బ్యాలెట్ యూనిట్లను తీసుకొస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది



పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక నిఘా

- సమస్యాత్మక ప్రాంతాలలో పటిష్ట భద్రత
- చందానగర్ సీఐ పాలవెల్లి


శాంతినగర్ పోలింగ్ స్టేషన్ వద్ద భద్రతను పరిశీలిస్తున్న ఎస్‌ఐలు సరితారెడ్డి, విఠల్‌రెడ్డి

హఫీజ్‌పేట్ : పోలింగ్ నేపథ్యంలో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రత్యేక నిఘాతో పాటు పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని చందానగర్ సీఐ పాలవెల్లి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 6 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామన్నారు. చందానగర్‌లోని శాంతినగర్, వేముకుంట, లింగంపల్లి జెడ్పీహెచ్ఎస్ స్కూల్, పాపిరెడ్డి కాలనీ, గోపినగర్, గోపన్‌పల్లి ప్రాంతాలు సమస్యాత్మకంగా ఉన్నాయని సీఐఎస్‌ఎఫ్ ప్రత్యేక పోలీసు బలగాలతో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశామన్నారు.

విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

గచ్చిబౌలి: ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ విధిగా ఓటు వేయాలని కోరుతూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కొండాపూర్‌లోని లిటిల్ మిలీనియం ప్రీ స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లకార్డులు ధరించి ప్రధానరోడ్డు, కూడళ్ళ వద్ద ఈ అవగాహన ర్యాలీ నిర్వహించారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారికి ఫస్ట్ ఎయిడ్



గచ్చిబౌలి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సపర్యలు చేశారు ట్రాఫిక్ పోలీసులు. బుధవారం ఉదయం ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ వారి దగ్గరికి వెళ్ళి సపర్యలు చేసి ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. వారికి ఫస్ట్ ఎయిడ్ చేసి పంపించారు. ఇతర వాహనదారులు ఆయన చొరవను అభినందించారు.

నాలెడ్జి సిటీలో సీ1 గ్లోబల్ ఇన్నోవేషన్ కేపబిలిటీస్ సెంటర్

ప్రారంభించిన సంస్థ సీఈఓ జెఫ్రీ రస్సెల్

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జిసిటీలో సీ1 (కన్వర్జ్‌వన్) గ్లోబల్ ఇన్నోవేషన్ అండ్ కేపబిలిటీస్ సెంటర్ (జీఐసీసీ) తన కార్యకలాపాలను భారతదేశంలో ప్రారంభించింది. ఈ సంస్థ కార్యాలయాన్ని బుధవారం జీఐసీసీ సంస్థ సీఈఓ జెఫ్రీ రస్సెల్ ప్రారంభించారు. సీ1 అధునాతన సాంకేతికత, పరిష్కారాల సంస్థ. దీన్ని ప్రారంభించిన అనంతరం విలేకరులతో ఆ సంస్థ సీఈఓ జెఫ్రీ రస్సెల్ మాట్లాడుతూ 10వేలకు పైగా గ్లోబల్ వినియోగదారులకు వినూత్న పరిష్కారాలను, అసమానమైన సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో సీ1 ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ , కంట్రీ హెడ్ చంద్ర బొడ్డోజు, చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ కొలీన్ హేబర్‌మాన్, చీఫ్ గ్రోత్ ఆఫీసర్ అమృత్‌చౌదరి, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంస్థ సీఈఓ జెఫ్రీ రస్సెల్

144 సెక్షన్ అమలు.. విధుల్లో 2500 మంది పోలీసులు

- నలుగురి కంటే ఎక్కువమంది గుమికూడితే చర్యలు
- పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరం వరకే అనుమతి
- సెల్‌ఫోన్లను అనుమతించం: మాదాపూర్ డీసీపీ సందీప్



గచ్చిబౌలి: పోలింగ్ కేంద్రాలు, ఇతర ప్రాంతాలలో నలుగురి కంటే ఎక్కువమంది గుమికూడితే చర్యలు తీసుకుంటామని మాదాపూర్ డీసీపీ గోనె సందీప్ స్పష్టం చేశారు. మద్యం అమ్మకాలు నిషేధమన్నారు. 28 సమస్యాత్మక ప్రాంతాలలో సీఏపీఎఫ్ సిబ్బందిని నియమించామని, అదనపు బలగాలు మూడు కంపెనీలతో పాటు 600 మంది పోలీసు సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. పోలింగ్ కేంద్రంలో ఎలాంటి ఘటన చోటు చేసుకున్నా ఒక్క నిమిషంలో అక్కడున్న పోలీసులు స్పందిస్తారని, 8 నిమిషాలకు రూట్ మొబైల్, 12 నిమిషాలలో క్యూఆర్టీ టీం, 18 నిమిషాలలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ చేరుకుంటుందన్నారు. పోలింగ్ బూత్‌లోకి పార్టీ గుర్తులు, స్లిప్స్, పెన్ను, ఇంక్, వాటర్ బాటిల్స్, సిగరెట్స్, లైటర్స్‌ను అనుమతించమన్నారు. ఎక్కడైనా ప్రలోభాలకు పాల్పడితే సీవీజిల్, డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.

రోడ్లపై.. ఇష్టారాజ్యంగా..

- భవన నిర్మాణ సామగ్రి, వ్యర్థాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోతున్న స్థానికులు

మాదాపూర్: భవన నిర్మాణాలకు ఉపయోగించే సామగ్రి, వ్యర్థాలను రోడ్లపై ఉంచడంతో రోడ్లు కుచించుకుపోతున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. నిత్యం వేలాది మంది ఐటీ ఉద్యోగులు ప్రయాణించే ప్రాంతం కావడంతో రోడ్లన్నీ రద్దీగా ఉంటాయి. మాదాపూర్‌లోని చందానాయక్ తండా, సాయినగర్, అయ్యప్పసొసైటీలో అధికంగా భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. యజమానులు నిర్మాణ సామగ్రి వేసుకునేందుకు స్థలం లేకపోవడంతో రోడ్లపై వేస్తున్నారు. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై నిర్మాణరంగ వ్యర్థాలను సైతం రోడ్లపైనే వేస్తున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


చందానాయక్ తండాలో.. సెంట్రింగ్ వస్తువులు, రోడ్డు పక్కన నిర్మించిన చిన్న గది

నిర్మాణ వ్యర్థాల తొలగింపునకు జీహెచ్‌ఎంసీ వారికి సమాచారమిస్తే ఒక ట్రిప్‌కి చార్జి చేసి తీసుకునిపోతారు. ఇది జరగకపోవడంతో సమస్య తలెత్తుతోంది. వస్తు సామగ్రిని రోడ్డుపై వేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.


మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో రోడ్డుపైన భవన నిర్మాణ సామగ్రి

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మియాపూర్ : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజమండ్రికి చెందిన శ్రీనివాస్, పిట్టామణి(40) కూకట్‌పల్లిలోని సర్దార్ పటేల్‌నగర్ కాలనీలో నివాసముంటున్నారు. శ్రీనివాస్ వాచ్‌మెన్‌గా పనిచేస్తుండగా భార్య పిట్టామణి స్థానికంగా ఇళ్లల్లో పనిచేస్తోంది. వీరికి వెంకట్, రాణి ఇద్దరు పిల్లలున్నారు. ఈ క్రమంలో పిట్టామణి ద్విచక్రవాహనంపై కుమారుడు వెంకట్‌తో కలిసి మియాపూర్ వైపు చర్చికి వెళ్తుండగా మియాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలో డీసీఎం వాహనం వెనుకనుండి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న పిట్టామణి కిందపడగా ఆమె పై నుంచి డీసీఎం వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.